

# నాది కాని దాని గురించి ఆలోచించను

సమంత ఓ సంచలనాత్మక మహిళ. ఏ విషయాన్నయినా కుండ బద్దలు కొట్టి చెప్పటం ఆమె శైలి. స్త్రీత్వాన్ని అమితంగా గౌరవించడం.. దానికితోడు ఆత్మాభిమానం.. ఈ రెండూ ఆమెను నిరంతరం వార్తల్లో వ్యక్తిగా నిలబెడుతుంటాయి. విడిపోయిన తర్వాత, మాజీ భాగస్వామి గురించి మాట్లాడటానికి ఎక్కువమంది ఇష్టపడరు. కానీ సమంత నిర్మొహమాటంగా మాట్లాడేస్తుంది. ఆ మధ్య 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రొమోషన్స్‌లో.. 'అవసరం లేకపోయినా అత్యధిక మొత్తంలో దేనికోసం ఖర్చుపెట్టారు?' అనే ప్రశ్న తన కోస్టార్ వరుణ్ ధావన్ రూపంలో సామ్‌కి ఎదురవ్వగా.. 'నా మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకలు..' అంటూ సూటిగా బదులిచ్చింది సమంత. 'ఎతుంటుందేంటి?' అని వరుణ్ రెట్టించి అడిగితే.. 'కాస్త ఎక్కువే..' అంటూ నవ్వేసింది సామ్. కరణ్‌జోహార్ టాక్ షోలో కూడా 'మాజీ, నేనూ ఒకే గదిలో ఉన్నప్పుడూ.. మా చేరువలో కత్తులు ఉండకపోవడం మంచిదైంది..' అని ఓపెన్‌గా చెప్పేసింది. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు.. 'రిలేషన్‌షిప్ నుంచి బయటకొచ్చారు కదా.. ఒంటరి జీవితం ఎలావుంది?' అనే ప్రశ్న ఎదురైంది. 'ఆ ప్రభావం నుంచి బయటకు రావడానికి చాలా శ్రమించా.' అని సింపుల్‌గా సమాధానమిచ్చింది సమంత. మీ మాజీ భాగస్వామి కొత్త బంధంలోకి అడుగుపెట్టినందుకు అసూయగా లేదా? అనడగ్గా.. 'నా జీవితంలో అసూయ అనేదానికి తావే లేదు.. ఇవ్వను కూడా. అన్ని చెడులకూ మూలం అసూయే.. అది నేను ప్రగాఢంగా నమ్ముతా.. నాది కాని దాని గురించి నేను అస్సలు ఆలోచించను' అని తేల్చిచెప్పేసింది సమంత.






# శ్రీవిష్ణుతో వెంకీ సందడి?

ఈ పానిండియా యుగంలో రీజనల్ మూవీస్ కూడా మూడొందల కోట్లు కొల్లగొట్టగలవని నిరూపించిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. ఊహించని విజయం ఇది. టాలీవుడ్ సీనియర్ హీరోల్లో ఎవరికీ లేనంత పెద్ద విజయాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం'తో అందుకున్నారు వెంకటేష్. దాంతో ఆయన నెక్ట్స్ సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో వెంకీ నెక్ట్స్ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఆయన చేయబోయే సినిమా ద్వారా ఓ రచయిత దర్శకునిగా పరిచయం కానున్నారట. వెంకటేష్ ప్రధాన పాత్ర పోషించనున్న ఈ సినిమాలో.. హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్ర పోషించనున్నట్టు సమాచారం. 'సంక్రాంతికి వస్తున్నాం' తరహాలోనే పూర్తిస్థాయి వినోదభరితమైన స్క్రిప్ట్‌తో ఈ సినిమా రూపొందనున్నదట. దాదాపు సినిమా ఖరారైందని, అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని అని తెలుస్తున్నది.

# నా స్థాయిని పెంచే పాత్ర ఇది



**వంశపారపర్యంగా వచ్చిన స్టార్‌డమ్ ఎలాగూ ఉంది. దాన్ని నిలబెట్టుకుంటూ.. సినిమా సినిమాకీ నటుడిగా ఎదుగుతూ.. అక్కినేని మూడోతరం జెండాని బలంగా ఎగరేస్తున్నారు యువసామ్రాట్ నాగచైతన్య. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ పతాకంపై చందూ మొండేటి దర్శకత్వంలో ఆయన నటించిన ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'తండేల్' ఈ నెల 7న విడుదల కానుంది. ఆకాశమంత అంచనాలతో వస్తున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానులు కొండంత ఆశపెట్టుకున్నారు. అందరి ఆకాంక్ష తీరా సినిమా ఘన విజయం సాధించి తీరుతుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు నాగచైతన్య. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు.**

- రియల్‌లైఫ్ స్టోరీస్ ఆధారంగా చేసే సినిమాల్లో నటించాలనే కోరిక నాకెప్పట్నుంచో ఉంది. 'దూత' వెబ్‌సిరీస్ చేస్తున్న సమయంలో ఈ కథ గురించి విన్నాను. బన్నీవాసు ఈ కథను హోల్డ్ చేశారని తెలిసింది. స్వయంగా వెళ్లి కలిసి కథ విన్నాను. డాక్యుమెంటరీలా అనిపించింది. సినిమాటిక్ లాంగ్వేజ్‌లోకి తీసుకురావడానికి చాలా వర్క్ చేశాం. చివరకు అద్భుతంగా తయారైంది.
- ఇది నా కెరీర్‌లో అన్ని విధాలుగా పెద్ద సినిమా. ఎంతో కష్టపడి ఇష్టపడి ఈ పాత్ర చేశాను. నటుడిగా నన్ను మరోస్థాయిలో నిలబెట్టే క్యారెక్టర్ ఇది. దాని లైఫ్ స్టైల్ తెలుసుకోవాలని నేరుగా శ్రీకాకుళం వెళ్లాను. ఆ యాస కోసం ప్రత్యేకంగా ట్యూషన్ తీసుకున్నాను. స్క్రిప్ట్‌పై డైరెక్టర్ చందూ మొండేటి.. ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం నేను.. ఎనిమిది నెలలు కష్టపడ్డాం. ఆ కష్టాన్ని తెరపై చూసుకున్నాక, పడిన కష్టం మొత్తం దూది పింజల్లా ఎగిరిపోయింది.
- ఇది సముద్ర నేపథ్యంలో సాగే ప్రేమకథ. నాచురాలిటీ కోసం సముద్రంలో రియల్‌గా షూట్ చేశాం. అలా చేయడం పెర్ఫార్మెన్స్‌కు కూడా ప్లస్ అయింది. ముఖ్యంగా సెకండాఫ్ అయితే సూపర్. చివరి ముప్పై నిమిషాలు ఎంతో సంతృప్తినిచ్చింది. ఇక క్లైమాక్స్ అయితే గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది. ఇంకొన్ని గంటల్లో సినిమా విడుదల కానుంది. అందుకే చాలా ఎక్సయిట్మెంట్‌గా ఉంది.
- దర్శకుడు చందూ మొండేటితో ఇది నా మూడో సినిమా. తనతో ట్రావెల్ చేయడం నాకిష్టం. నన్ను కొత్తగా ప్రజెంట్ చేసేందుకు ప్రయత్నిస్తాడు. నాకోసమే ఆలోచిస్తాడు. ఈ సినిమాను కమర్షియల్‌గా పెద్దస్థాయికి తీసుకురావడానికి తను చేసిన కృషి అసామాన్యం. ఇక సాయిపల్లవి విషయానికొస్తే తనొక పాజిటివ్ ఎనర్జీ. పాత్రను డీప్‌గా అర్థం చేసుకొని నటిస్తుంది. అలాంటి నటితో పనిచేయడం నిజంగా ఓ సవాల్. గీతా ఆర్ట్స్‌లో ఇది నా రెండో సినిమా. తొలి సినిమా '100 పర్సంట్ లవ్' పెద్ద హిట్. ఇది కూడా కచ్చితంగా హిట్టే. గీతా ఆర్ట్స్ ప్రొడక్ట్ బావుంటుంది. యాక్టర్‌కి మంచి రిలీజ్ ఇస్తారు. అవకాశం వస్తే మరోసారి గీతా ఆర్ట్స్‌లో నటించాలని ఉంది.



# మళ్లీ సినిమాలు తీస్తా..



'మహాబలిపురంలో ఉన్న నా పది ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14ఏళ్లు ఈ విషయంపై న్యాయ పోరాటం చేశా. చివరకు అది తప్పుడు కేసు అని తేలింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది.' అంటూ ఆనందం వెలిబుచ్చారు నిర్మాత శింగనమల రమేష్‌బాబు. కొమరంపులి, ఖలేజా చిత్రాలతోపాటు పలు విజయవంతమైన చిత్రాలను కూడా నిర్మించారాయన. పైన ఆయన పేర్కొన్న కేసులో 14ఏండ్ల పాటు న్యాయస్థానంలో విచారణ జరుగగా.. ఎట్టకేలకు గత నెల 31న శింగనమల రమేష్ నిర్దోషి అంటూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా తన భవిష్యత్ కార్యకలాపాలను వివరించడానికి బుధవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో రెండు భారీ చిత్రాలు నిర్మించి వందకోట్లు నష్టపోయానని, ఇక నుంచి కథను నమ్ముకొని సినిమాలు చేయాలనుకుంటున్నానని, తన కుమారులు కూడా పరిశ్రమలోనే సెటిల్ అయ్యారని రమేష్ తెలిపారు. 'ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని అయిన నేను.. సినిమాపై పాషన్‌తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి. ఇకనుంచి మంచి కథలతో సినిమాలు చేయాలనుకుంటున్నాను.' అని శింగనమల చెప్పారు.

# కూచిపూడివారి వీధి

డైరెక్టర్ వంశీ అనగానే గోదారి గుర్తొస్తుంది. శ్రీకాంత్ అడ్డాల అనగానే గోదావరి నేటివిటీ గుర్తొస్తుంది. కొత్త బంగారులోకం, సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రాలను అంతబాగా మలిచారాయన. ఆ తర్వాత వచ్చిన 'ముకుంద' కూడా పర్లేదనిపించింది. అయితే.. మహేశ్‌బాబుతో చేసిన 'బ్రహ్మోత్సవం' చిత్రంతో శ్రీకాంత్ అడ్డాలకు కష్టాలు మొదలయ్యాయి. తన శైలికి భిన్నంగా తీసిన 'పెదకాపు' కూడా నిరాశే మిగిల్చింది. ఆ తర్వాత కన్నడంలో సినిమా చేయాలనుకున్నారు. అదీ కుదర్లేదు. అందుకే.. ఇప్పుడు మళ్లీ తనకు కలిసొచ్చిన జానర్‌లో కథ తయారు చేసుకున్నారు శ్రీకాంత్ అడ్డాల. 'కూచిపూడి వారి వీధి' అని టైటిల్ కూడా పెట్టేశారు. గతంలో అన్నదమ్ముల కథగా 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' తీశారాయన. ఇప్పుడు అక్కచెల్లెళ్ల కథగా ఈ 'కూచిపూడి వారి వీధి' తీయబోతున్నారు. దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరు మంచి హీరోయిన్లకోసం శ్రీకాంత్ అన్వేషిస్తున్నారట. ఆ ఇద్దరూ సెట్ అయితే.. ప్రాజెక్ట్ ముందుకెళ్తుంది.

# తారక్, నీల్ ప్రాజెక్ట్‌లో..



ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులందరి దృష్టి ప్రశాంత్‌నీల్‌తో చేయబోయే సినిమాపైనే ఉంది. ఆ సినిమా అప్‌డేట్ల కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ దాదాపుగా ఖరారైందని టాక్. ప్రస్తుతం తారక్ 'వార్2' షూటింగ్‌ను ముగించే పనిలో ఉన్నారు. ఆ సినిమా తర్వాత వెంటనే ఈ సినిమా సెట్స్‌లోకి ఆయన ఎంట్రీ ఇస్తారు. ఈ నెల చివర్లోగానీ, వచ్చే నెల ప్రథమార్ధంలోగానీ ఈ సినిమా సెట్స్‌కి వెళ్లొచ్చని సమాచారం. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తుంది. కథ రీత్యా ఇందులో ఓ కీలకమైన పాత్ర ఉందట. ఆ పాత్రకు మలయాళ అగ్ర నటుడు టోవినో థామస్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం. మలయాళంలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించిన టోవినో.. '2018' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. మరి 'డ్రాగన్'లో ఆయన నటిస్తున్న మాట నిజమేనా? ఒకవేళ నిజమైతే అది ఏ తరహా పాత్ర? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే.. ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# చెబితే నవ్వి ఊరుకునేవాడు..



హీరోయిన్‌గా త్రిషకు ఉన్న లాంగ్విటీ ఇప్పుడున్న హీరోయిన్లలో ఎవరికీ లేదని చెప్పాలి. ఇప్పటికీ అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్ చేస్తూ బిజీబిజీగా ఉన్నారామె. అజిత్‌తో ఆమె నటించిన 'విడాముయార్చి' సినిమా 'పట్టుదల' పేరుతో తెలుగులో విడుదల కానుంది. ఇంకా గుడ్ బ్యాడ్ అగ్లీ, విశ్వంభర, థగ్‌లైఫ్ చిత్రాలతో క్షణం తీరిక లేకుండా ఉన్నారు త్రిష. ఇటీవల 'విడాముయార్చి' ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో ఇంటరాక్ట్ అయ్యారు త్రిష. ఈ సందర్భంగా దళపతి విజయ్ గురించి ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. 'నేనూ విజయ్ మంచి ఫ్రెండ్స్. తనో ఇంట్రావర్ట్. షాట్ అవ్వగానే ఒక్కడే ఏదో గొడ చూసుకొని, అక్కడే కుర్చీ వేసుకొని అందరికీ దూరంగా కూర్చుంటాడు. అలా కూర్చోవద్దు.. అందరితో కలిసుండాలని నేను చాలాసార్లు చెప్పాను. నవ్వి ఊరుకునేవాడు. తనకు పాలిటిక్స్‌పై ఎప్పట్నుంచో ఇంట్రస్ట్ ఉంది. అది నాకు తెలుసు. తన ఆలోచనలన్నీ భిన్నంగా ఉంటాయి. ఏదో సాధించాలనే దృక్పథంతో ఉండేవాడు. కచ్చితంగా అనుకున్నది మాత్రం సాధిస్తాడని నా నమ్మకం.' అని తెలిపింది త్రిష.

# భయపెట్టే భవానీ వార్డ్



గాయత్రి గుప్తా, గణేష్‌రెడ్డి, పూజా కేంద్రే, సాయి సతీష్, జబర్దస్త్ అప్పారావు, ఈశ్వర్‌బాబు ధూళిపూడి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'భవానీ వార్డ్ 1997'. జీడీ నరసింహా స్వీయ దర్శకత్వంలో చంద్రకాంత్ సోలంకితో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. హారర్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా బాగా నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో నటించడం పట్ల నటీనటులందరూ ఆనందం వెలిబుచ్చారు. ఉత్కంఠను రేకెత్తించే ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్ కొత్తగా ఉంటుందని కెమెరామెన్ అరవింద్ తెలిపారు. హారర్ చిత్రాలకు ఆర్ఆర్ ఇవ్వడం కత్తిమీద సాము లాంటిదని, ఈ సినిమాకు అద్భుతమైన ఆర్ఆర్ కుదిరిందని మ్యూజిక్ డైరెక్టర్ నిస్సి జస్టిస్ చెప్పారు.

